వైభవంగా భీష్మ ఏకాదశి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- భక్తితో గణపతి, చండీ, మహాసరస్వతి హోమాలు



ప్రత్యేక అలంకరణలో కొలనుభారతి దేవి అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. సద్గురువు నారాయణ సరస్వతి స్వామి ఆశీస్సులతో కాకనూరు శారదాపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి మంగళవాయిద్యాలతో అమ్మవారి కొలువు, అర్చన, వేదపారాయణం, మహామంగళహారతి కార్యక్రమాలు, రాత్రి శివయోగేంద్ర సరస్వతి స్వామి, కాకనూరు శారధ పీఠం పీఠాధిపతి ఉపన్యాసాలు, కరిమద్దెల, కానాల, పార్నపల్లె, కాకనూరు, నంద్యాల, యంబాయి, గ్రామాల వారిచే చెక్కభజనలు నిర్వహించారు. మంగళవారం రోజున భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రాతఃకాలంలో అమ్మవారిని మంగళవాయిద్యాలతో మేలుకొలుపు, పంచామృత అభిషేకం, అలంకరణ మహానివేదన కార్యక్రమాలు చేశారు. అనంతరం కొలనుభారతి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి, చండీ, మహాసరస్వతి హోమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ, అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో ఆలయ పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు, అర్చకులు, సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు భారతాల పున్నమి వేడుకలు



పూజలకు సిద్ధమైన చౌడేశ్వరిదేవి

నందికొట్కూరు: స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో బుధవారం భారతాల పున్నమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చింతా రామకృష్ణ తెలిపారు. వేడుకల నేపథ్యంలో మంగళవారం అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పంచముఖి వినాయకుడి ఆలయం వరకు చెక్కభజన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారి ఆలయంలో పున్నమి పూజ, ఒంటి గంటకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సర్వే వేగవంతం చేయండి



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: పీఎంఏజీవై ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట గ్రామంలో సచివాలయ సిబ్బంది చేస్తు న్న సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. ప్రజలు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి సర్వే కీలకమన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ రంగనాయక్, పంచాయతీ కార్యదర్శి ఖాజా ఉన్నారు.

పరివార దేవుళ్లకు ప్రత్యేక పూజలు



నందీశ్వరునికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలోని క్షేత్రపాలకుడు బయలు వీర భద్ర స్వామికి, ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామికి, జ్వాలా వీరభద్రునికి, నందీశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృత్తికా నక్షత్రం రోజున సుబ్రహ్మణ్య స్వామికి, ప్రతి మంగళవారం త్రయోదశి రోజులలో బయలు వీరభద్ర స్వామికి, నందీశ్వరునికి ప్రత్యేక సర్కారీ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే జయసూర్య



దుద్యాల సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తపల్లి: గ్రామాలలో ఏర్పాటు చేసిన సచివాలయాల, రైతుసేవా కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో సచివాలయం, రైతుసేవా కేంద్రాన్ని, దుద్యాలలో సచివాలయాల నూతన భవనాలను ప్రారంభించారు. ఎదురుపాడు రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, చిరుధాన్యాల నమూనాను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైద్యశాలకు మంచం విరాళం



ఐసీయూకు విరాళంగా ఇచ్చిన మంచం

నందికొట్కూరు: సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాత పి.రమేష్ రూ.15 వేల విలువ చేసే మంచం విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తీసుకురాగా ఐసీయూలో మంచం లేదని తెలిసి తానే విరాళంగా ఇచ్చానన్నారు. దాతకు వైద్య బృందం కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు మార్గంలోని ఆంజనేయపురం సమీపంలో కారు – బైక్ ఢీకొన్న ఘటనలో గాజులపల్లెకు చెందిన జూటూరు నాగరాజు గాయపడ్డాడు. నాగరాజు పొలం నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో రోడ్డుపైకి వస్తుండగా ఆళ్లగడ్డ నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంతో గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న పర్స్ అప్పగింత



నాగిరెడ్డికి పర్సును అందిస్తున్న ఏఈఓ, సూపరింటెండెంట్లు

మహానంది: వికారాబాద్ జిల్లా బాలంపేట్‌కు చెందిన నాగిరెడ్డి మంగళవారం మహానందికి వచ్చారు. కోనేరు వద్ద కవర్ పోయినట్లు గుర్తించిన భక్తుడు నాగిరెడ్డి హోంగార్డు కోటయ్య దృష్టికి తీసుకెళ్లారు. సీసీ కెమెరాలు పరిశీలించి కవర్‌ను గుర్తించి అందులో రూ.35 వేల నగదు ఉండటంతో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తుడికి అప్పగించారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టిపెట్టండి

- డీఈఓ పి.జనార్దన్‌రెడ్డి



మోడల్ పాఠశాల్లో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

జూపాడుబంగ్లా: వెనుకబడిన విద్యార్థులపై దృష్టిపెట్టాలని డీఈఓ పి.జనార్దన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలలను తనిఖీచేశారు. స్టడీ అవర్స్‌పై ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. స్టడీ మెటీరియల్స్‌తో పాటు మోడల్‌పేపర్స్ ఇచ్చి వాటిని ప్రాక్టీస్ చేసిన తర్వాత విద్యార్థులకు స్లిప్‌టెస్టులు నిర్వస్తున్నట్లు తెలిపారు. సీ, డీ కేటగిరిల్లోని విద్యార్థులపై ఉపాధ్యాయులతో ప్రత్యేక శ్రద్ధ వహించేలా చేసి కనీసం వారు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించామన్నారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులు సీబీఎస్‌ఈ సిలబస్‌ను అభ్యసించినప్పటికీ స్టేట్ మోడల్ వార్షిక పరీక్షలు రాయటానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈయన వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఎస్ఓ యశోద, సత్యనారాయణమూర్తి ఉన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు ఇచ్చే ఆర్థిక సాయం పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు, హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వాములు, మున్సిపల్ కార్మికులు జయన్న, దేవదాసు, రవి, కృష్ణుడు, రాజేంద్ర, సురేష్, నాగప్రసాద్, చిన్న నాగన్న, దేవమ్మ, సుశీలమ్మ, సామక్క, సుగుణమ్మ పాల్గొన్నారు.

శిల్పాను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని హైదరాబాద్‌లో ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఆమె తండ్రి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రషీద్ మంగళవారం కలిశారు.

–ఆత్మకూరు

పోరాటాలకు సిద్ధం కావాలి



వాల్మీకి నూతన నియోజకవర్గ కమిటీ సభ్యులు

నందికొట్కూరు: వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు సిద్ధం కావాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండ సూచించారు. మంగళవారం జైకిసాన్ పార్కులో మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మిట్టకందాల శంకర్, ఉపాధ్యక్షులుగా లింగాల రమణ, న్యాయ సలహాదారులుగా వెంకటరాముడు, వెంకటేశ్వర్లను ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లారం రవి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ సందర్శన



ల్యాబ్‌ను సందర్శించిన విద్యార్థులు

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చక్కటి వసతులు ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం కంప్యూటర్ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, జేకేసీ ల్యాబ్, స్కిల్ హబ్ సెంటర్, లైబ్రరీ, న్యూ సెమినార్ హాల్, ఓల్డ్ సెమినార్ హాల్, జిమ్, యోగా సెంటర్, కళాశాల గ్రౌండ్, ఎన్ఎస్ఎస్ ఆఫీస్, వివిధ శాఖల గదులను ప్రభుత్వ జూనియర్, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సందర్శించారు.

సస్యరక్షణ చర్యలతో దిగుబడులు మెండు



మిరప దిగుబడులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జూపాడుబంగ్లా: మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి మెరుగైన దిగుబడులు సాధించాలని బనవాసి కృషివిజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర సూచించారు. మంగళవారం మండలంలోని తంగడంచ గ్రామంలోని రైతుసేవాకేంద్రంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాఘవేంద్ర, ఉద్యానవన అధికారిణి తేజశ్విని మాట్లాడుతూ నల్ల, ఎర్ర నేలలకు తగిన మిరప విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తనశుద్ధి తర్వాత నారుమళ్లు చేసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలు సాగుచేసుకునే రైతులకు అధిక రాయితీలు ఇస్తున్నట్లు తేజశ్విని తెలిపారు. పండ్లతోటలు పెంచుకునే వారికి 40 శాతం, ఉల్లి గోదాముల నిర్మాణానికి 50 శాతం, ప్యాక్‌హౌస్ నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మిరప పొలానికి వెళ్లి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తెగుళ్ల నివారణ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్

పగిడ్యాల: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ సాధ్యమని వైద్యులు మోహన్, అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల వ్యాప్తంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 90 శాత మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ పూర్తయినట్లు వారు తెలిపారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 17న రెండవ విడతలో మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ సురేష్

జూపాడుబంగ్లా: మహిళలు వ్యవసాయ రంగంలో రాణించటంతో పాటు వ్యవసాయ అనుబంధ ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జిల్లా రైతు ఉత్పత్తిదారుల సంఘం కోఆర్డినేటర్ సురేష్ సూచించారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పొదుపు సంఘాలతో పాటు రైతుసంఘాలుగా ఏర్పడి అభివృద్ధి బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పావనిరెడ్డి, ఏఓ కృష్ణారెడ్డి, సెరికల్చర్ టీఏ కాశీవిశ్వనాథం, ఏపీఎం అంబమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు పర్యటిస్తాయని ఏపీఓ విమలమ్మ తెలిపారు. మంగళవానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు మండలంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 వరకు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేసి 21న మండల కేంద్రంలో బహిరంగ సామాజిక తనిఖీ సమావేశం ఏర్పాటు చేయనునుట్లు తెలిపారు.

రుణాల దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

పాములపాడు: వెనుక బడిన తరుగతుల సబ్సిడీ రుణాల దరఖాస్తుకు బుధవారంతో గడువు పూర్తవుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాల వారికి బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు తెలిపారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సేవాలాల్ జయంతికి తరలిరండి

వెలుగోడు: ఈనెల 14, 15 తేదీలలో సేవా ఘడ్‌లో నిర్వహించనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాలకు బంజారాలు తరలిరావాలని బంజారాల సంఘం రాష్ట్ర నాయకులు నాగేష్ నాయక్ కోరారు. మంగళవారం స్థానిక జమ్మి నగర్ తండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ సెలవు దినముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే రైల్వే పాసులు

పాములపాడు: దివ్యాంగులకు ఆన్‌లైన్‌లోనే రైల్వే పాసులు పొందవచ్చని నవ్యాంధ్ర వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి భాస్కర్ రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఇక నుంచి రైల్వే పాసుల కోసం రైల్వే స్టేషన్, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదన్నారు. రైల్వే పాసు పొందటానికి రైల్వే శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేసిందని, అందులోనే ఈ టికెట్లు బుక్ చేసుకునే వీలుందన్నారు. http:llldivyanginid.indianrail.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పాసు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

1,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1,400 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. నీలిషికారి జానుభా నుంచి 45 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా మాట్లాడుతూ సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించామన్నారు. బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

20, 27 తేదీల్లో పెన్షన్ల పరిశీలన

బండి ఆత్మకూరు: ఈనెల 20, 27 తేదీలలో మండల పరిధిలోని డిసేబుల్డ్ పెన్షన్‌ల పరిశీలన ప్రక్రియ ఉంటుందని ఎంపీడీఓ ఎం.దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో ఎ.కోడూరు, బి.కోడూరు, బండిఆత్మకూరు 1, 2, భోజనం, చిన్న దేవళాపురం, ఈర్నపాడు గ్రామాల్లో, రెండవ విడతలో మిగిలిన గ్రామాల్లో పరిశీలన ఉంటుందన్నారు. ఆయా గ్రామాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు వారంరోజులు ముందుగానే పెన్షనర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో సచివాలయం, రైతుసేవా కేంద్రం నూతన భవనాలను అధికారులు ఎమ్మెల్యేతో ప్రారంభింపజేశారన్నారు. ఆయా కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ షేక్ నాజియాను పిలవకపోవడం తగదన్నారు. ఇదే విషయమై సర్పంచ్ అక్కడికి వెళ్లి అధికారులను ప్రశ్నించిన తర్వాత ఎమ్మెల్యే చొరవతో ప్రారంభానికి పిలిచారన్నారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గుండె వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు



గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: గుండె వ్యాధులపై నిర్లక్ష్యం వద్దని డాక్టర్లు సోహైల్, విజయభార్గవ్, లీలా వినయ్ రెడ్డి, జాన్సీరాణి, సంగీత తెలిపారు. గుండె నొప్పితో ఆస్పత్రికి వచ్చిన సున్నిపెంటకు చెందిన హుస్సేన్‌బీకి మంగళవారం రూ.40 వేల విలువ చేసే ఇంజక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు గుండె సంబంధిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఛాతిలో నొప్పి, ఆయాసం తదితరల లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆస్పత్రికి వచ్చి డాక్టర్లను సంప్రదించాలన్నారు. లేదా 108 నంబర్‌కు కాల్ చేసి అంబులెన్స్‌లో వైద్యశాలకు సేరుకుని వైద్యసేవలు పొందాలన్నారు. అవసరమైతే రూ.40 వేల విలువచేసే ఇంజక్షన్ కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా ఇస్తారన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యం

కొత్తపల్లి: రైతులు పంటలు సాగుచేసే సమయంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఉద్యానశాఖ అధికారి చందన సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామ శివారుల్లో ఉల్లి పంటలో మెలకువలపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లి నాటుకునే ముందు దుక్కిలో ట్రైకోడెర్మా విరిడి తప్పక వాడాలన్నారు. ఉల్లి నాటుకున్న 30 రోజుల తర్వాత సీఏఎన్ ఒక బ్యాగు, సల్ఫర్ 10 కేజీలు వేసుకోవాలన్నారు. ఉల్లి సాగులో తామర పురుగు ఆశించినట్లయితే నీలి రంగు జిగురు అట్టలు అమర్చుకోవాలన్నారు. వేప నూనె 10,000 పీపీఎం 200 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బనవాసి కేవీకే ప్రిన్సిపాల్ కో–ఆర్డినేటర్ కె.రాఘవేంద్ర, ఏఓ మహేష్, వీఏఏ షఫీ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వడ్డేమాన్ సమీపంలోని మినుము పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏడీఏ జయశేఖర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని వడ్డేమాన్, కోనేటమ్మపల్లి గ్రామాల పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటను పురుగు, కాయ తొలిచే పురుగు నివారించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వేరు కుళ్లు, మొదల కుళ్లు తెగుళ్లు ఆశించి నష్టం కలిగించే విధానం గమనించాలన్నారు. పొలంబడి ద్వారా ఏయే పంటలు సాగు చేసుకోవచ్చు, ఏ భూములకు ఏ పంటలు సరిపోతాయి, గ్రామంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. సొంత భూమి ఉన్న రైతులు గుర్తింపు సంఖ్య పొందాలన్నారు.

జూపాడుబంగ్లా: మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధికదిగుబడులు సాధించవచ్చని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తరిగోపుల గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ ఏడాది మినుము పంటకు తెగుళ్లు అధికం కావటంతో దిగుబడి తగ్గిందన్నారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పొలం ఉన్న ప్రతి రైతు రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవటం వల్ల వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు తెలిపారు.

వెలుగోడు: మండలంలోని మాధవరం, మోత్కూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతు (ఫార్మర్) రిజిస్ట్రీ అమలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తొలి రోజు మండలంలో 114 మందికి విశిష్ట సంఖ్య రైతు సేవా కేంద్రాల ద్వారా జారీ అయ్యిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ఈ ప్రాజెక్టును కేంద్రం చేపట్టిందన్నారు.

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావుపేట, పిన్నాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఓ హేమలత రైతులకు వివరించారు. కంది పంట విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడీతోగానీ, మంకోజెబ్ 3 గ్రాములు చొప్పున విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల ఎండుతెగులు నివారించవచ్చన్నారు. గ్రామాల్లోని రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రైతులు పంట మార్పిడి ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. గ్రామాల్లోని రైతులందరూ రైతేసేవా కేంద్రాల్లో పంట నమోదు మరియు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులు వాడడం వల్ల భూసారం పెంచవచ్చన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏఓ హేమలత

- **బండి ఆత్మకూరు:** మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సొంత భూమి ఉన్న రైతులకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డును అందించనున్నట్లు, కార్డు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల సేవలు లభించనున్నట్లు ఆమె తెలిపారు. స్వంత భూమి ఉన్న రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. రబీ రైతులు పంట నమోదును, ఈ–కే వైసీని ఈనెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు.